సాక్షి జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



మానవత్వం చాటుకున్న..

లా అండ్ ఆర్డర్‌ను కాపాడడమే కాదు ఆపద లో ఉన్న వారిని తన వంతు సాయం చేసి కాపాడుదామనే సంకల్పం అతనిది.

- 8లో▸



15 క్వింటాళ్ల బెల్లం పట్టివేత

15 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకొని బొలెరో వాహనాన్ని సీజ్ చేసినట్లు తొర్రూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

- 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి పూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు వాహనాల వేలం

భూపాలపల్లి రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు(గంపగుత్త) నేడు సోమవారం ఉదయం 11:30 గంటలకు భూపాలపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వాహనాలను కొనుగోలు చేసినవారు జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లించాలి

భూపాలపల్లి అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు తత్కాల్ పథకంలో ఈ నెల 15వ తేదీలోపు ఫీజు చెల్లించే అవకాశం ఉందని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష ఫీజు చెల్లించని పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం వెయ్యి రూపాయల ఆలస్య రుసుంతో మరో అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నిధులు కేటాయించడం అభినందనీయం



భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం రూ.1650 కోట్లు కేటాయించడం అభినందనీయమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, నాయకుడు సత్యపాల్‌రెడ్డి అన్నారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి కీర్తిరెడ్డి సత్యపాల్ రెడ్డి దంపతులు హాజరై మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన సొంతింటి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తుమ్మేటి రాంరెడ్డి, మనోహర్‌రెడ్డి, కంబాల రాజయ్య, కుమార్, మహిళా నాయకులు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మంగపేట: మండల పరిధిలోని కమలాపురంలో గల రోసా మిస్టికా కాన్వెంట్ హైస్కూల్ (ఆర్ఎంసీ) పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి బొడ్డు ఆకాశ్ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్రాన్సినా తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యార్థిని అభినందించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని బందారుపల్లి బాలుర గురుకుల పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ సొసైటీ 16 సంవత్సరాల విభాగంలో పాల్గొన్న ఆకాశ్ డిస్కస్‌త్రోలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు పాట్నాలో నిర్వహించనున్న 18వ ఇంటర్ డిస్ట్రిక్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసీ పాఠశాల మేనేజర్ సిస్టర్ ఆగ్నెస్, పీఈటీ జాడి శ్యామ్‌ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలతోనే పార్టీ బలోపేతం

వాజేడు: బూత్ కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజ సత్యవతి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని బలోపేతం చేసి ఎన్నికల్లో గెలిపించాలంటే బూత్ స్థాయి కమిటీల ప్రాధాన్యత ఎక్కువగా ఉండాలన్నారు. బూత్ స్థాయి కమిటీల సభ్యులు కష్టపడి పని చేస్తేనే రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు దంతులూరి సీతారామ రాజు, మండల అధ్యక్షుడు కందుల రామ్, కిశోర్, క్రాంతి కుమార్, సీతారామ రాజు, సుబ్బయ్య, షణ్ముఖరావు, ఆనంద్, పార్వతి, కృష్ణమూర్తి, దుర్గ, ప్రమీల, దీప, ప్రియ పాల్గొన్నారు.

వనదేవతల దర్శనం అనంతరం తిరుగుపయనమైన భక్తులు



సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తుల సందడి



అమ్మవార్లకు మొక్కుతున్న భక్తురాలు



మేడారం జనారణ్యం

అమ్మవార్లకు పౌర్ణమి పూజలు

మేడారం జనారణ్యంగా మారింది. మినీ జాతర శనివారంతో ముగిసినప్పటికీ ఆదివారం మాఘ శుద్ధ పౌర్ణమి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి లక్షన్నర మందికి పైగా భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది.

- ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸

ఉత్పత్తి అంతంతే..

- కేటీకే 8వ గనిలో ప్రైవేట్ కాంట్రాక్టర్‌తో పనులు
- బొగ్గు ఉత్పత్తిలో కనిపించని పురోగతి
- 10నెలల్లో 11శాతమే..



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 8వ గనిలో బొగ్గు ఉత్పత్తి చేసేందుకు కొంత భాగాన్ని ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో అప్పగించింది. ఉత్పత్తిని పెంచాలనే ఆలోచనతో తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి పురోగతీ కనిపించడం లేదు. కాంట్రాక్టర్‌కు శిక్షణ పొందిన కార్మికులు లేకపోవడం, కావాల్సిన యంత్రాలు లేకపోవడంతో ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. 10 నెలల కాలంలో యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో కేవలం 11 శాతం బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది.

రెండు సీమ్‌లు ప్రైవేట్‌కు..

8వ గనిలో 3 సీమ్‌లలో బొగ్గు ఉత్పత్తి అవుతుండగా ప్రైవేట్ కంపెనీకి 1, 2 సీమ్‌లను కేటాయించారు. మిగిలిన ఒక్క సీమ్‌లో సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి చేస్తుంది. భూగర్భంలో బొగ్గు ఉత్పత్తి అయ్యే సీమ్‌లనే ప్రైవేట్‌కు అప్పగించి.. సింగరేణి కార్మికులను దూర ప్రాంతానికి పంపించి బొగ్గు ఉత్పత్తిని చేస్తుంది.

అంతంత మాత్రమే..

గనిలో ఆశించిన స్థాయిలో సింగరేణి కార్మికులు బొగ్గు ఉత్పత్తిని చేయడం లేదని యాజమాన్యం కార్మికులకు నష్టం కలిగించే విధంగా ప్రైవేట్‌కు అప్పగించింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ మాసంలో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించారు. సింగరేణి కార్మికులు గడిచిన 10 నెలల కాలంలో 1.67లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 1.29లక్షల టన్నుల ఉత్పత్తి చేపట్టగా ప్రైవేట్ కంపెనీ మాత్రం 2.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా కేవలం 28వేల టన్నుల ఉత్పత్తిని మాత్రమే చేపట్టింది. నెలకు కనీసం 24వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నామమాత్రంగా సుమారు 4వేల టన్నులు మాత్రమే వెలికితీస్తున్నారు.

ముందుకు రాని కార్మికులు..

ప్రైవేట్‌కు అప్పగించిన రెండు సీమ్‌లలో విధులు నిర్వర్తించేందుకు ప్రైవేట్ కార్మికులు ముందుకు రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దానికి తోడు బొగ్గు ఉత్పత్తిపై అవగాహన, శిక్షణ పొందిన కార్మికులు దొరకడం లేదు. అంతేకాకుండా రోజుకు వేతనం రూ.540 మాత్రమే చెల్లిస్తుండటంతో సుముఖత చూపించడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. పనికి తగిన వేతనం లేక, పని స్థలాల్లో సౌకర్యాల, పనిముట్ల కొరత ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

మ్యాన్ పవర్, యంత్రాల కొరత

సింగరేణి కార్మికులకు కావాల్సిన యంత్రాలు ఉన్నప్పటికీ యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి అధికంగా చేపట్టాలని కొంతభాగాన్ని ప్రైవేట్ కంపెనీకి అప్పగించారు. దీనిపై సింగరేణి యాజమాన్యం సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండానే అనాలోచిత నిర్ణయంతో కాంట్రాక్ట్ అప్పగించినట్లు పలు కార్మికసంఘాలు ఆరోపిస్తున్నాయి. సంబంధిత కంపెనీకి సరిపడా కావాల్సిన యంత్రాలు, కార్మికులు కూడా లేకపోవడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతుంది. యంత్రాలు కూడా సరిపడా లేకపోవడంతో వాటిని సింగరేణి యాజమాన్యంతో సంబంధిత కంపెనీకి సమకూర్చిపెడుతోంది.

కమీషన్ల కోసమే..



కేటీకే 8వ గని భూగర్భ గనిలోని బొగ్గు ఉత్పత్తి పని స్థలాలను సింగరేణి యాజమాన్యం కమీషన్ల కోసం ప్రైవేట్‌కు అప్పగించింది. బొగ్గు ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యం ఉంటే వెంటనే కాంట్రాక్ట్‌ను రద్దు చేసి శక్తి, సామర్థ్యం కలిగిన వారికి అప్పగించండి.. లేదా సింగరేణి యాజమాన్యమే బొగ్గు ఉత్పత్తి చేపట్టాలి.

- అప్పాని శ్రీనివాస్,
బీఎంఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు

కల్యాణలక్ష్మి ఆడబిడ్డలకు వరం

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల(రేగొండ): కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డలకు వరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం రేగొండ మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆడబిడ్డలకు మేనమామగా నిలిచి ఆదుకుంటున్న ఒకే ఒక వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆడబిడ్డ పెళ్లికి కల్యాణలక్ష్మి ఆర్థికంగా ఎంతో తోడ్పాటు ఇస్తుందని అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరాగా నిలుస్తుందని అన్నారు. ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకుడు పున్నం రవి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, ఎంపీటీసీ మైస భిక్షపతి, టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, మటిక సంతోష్, కాకర్లపల్లి సర్పంచ్ కుసుంబ రంజిత్, బండి రమేష్ పాల్గొన్నారు.



ప్రధాన రహదారిలో ఏర్పడిన భారీ గుంత

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా..!

మూడు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నల్లగుంట మీనాజీపేట, నర్సింగాపూర్, యత్నారం, సింగంపల్లి వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా తెగిపోయాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కాటారం నుంచి మేడారం వెళ్లే ప్రధాన రహదారి కూడా పూర్తిగా తెగిపోయింది. అధికారులు తాత్కాలికంగా మట్టిపోశారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో మట్టి కొట్టుకుపోయి భారీ గుంత ఏర్పడింది. ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

- మహాముత్తారం

ఆందోళనలు ఉధృతం చేస్తాం

- 4వ రోజుకు చేరిన జర్నలిస్టుల దీక్షలు



దీక్షకు సంఘీభావంగా కూర్చున్న బీఎంఎస్ నాయకులు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేసే వరకు తమ ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని జర్నలిస్టులు హెచ్చరించారు. జిల్లాకేంద్రంలో జర్నలిస్టులు చేపడుతున్న దీక్షలు ఆదివారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు ఆదివారం బీఎంఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా కన్వీనర్ కొటం రవిపటేలు, నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు 2013లో అప్పటి ప్రభుత్వం స్థలాలు కేటాయించిందన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై జర్నలిస్టుల ఇళ్లను కూల్చేసేందుకు నోటీసులు జారీచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

దుర్మార్గమైన చర్య..

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులపై దుర్మార్గమైన చర్యలకు పునుకుందని మాజీ మంత్రులు ఈటల రాజేందర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. మాజీ మంత్రులు ఫోన్‌లో మాట్లాడి జర్నలిస్టులకు మద్దతు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేసి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీలను మరిచి గతంలో ఇచ్చిన ప్లాట్లను తీసుకుంటుందని ఆరోపించారు.

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి



సభలో మాట్లాడుతున్న నాగయ్య

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గత నెల 25వ తేదీన ప్రారంభించిన ఇళ్ల స్థలాలు పోరాటంలో భాగంగా ఆదివారం బాంబులగడ్డ నుంచి ఇళ్ల స్థలాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాగయ్య మాట్లాడారు. ప్రతీ ఒక్కరికి ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు ప్రజలకు పంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గుడిసెవాసులకు పట్టాలు రావని అధికారులు మాట్లాడడం సరికాదన్నారు. చెరువు శిఖం భూమికి రెవెన్యూ అధికారులు ఏ విధంగా పట్టాలు ఇచ్చారని ప్రశ్నించారు. చెరువు శిఖంలో మార్కెట్ యార్డ్, ఆటోనగర్ నిర్మాణాలకు నిధులు కేటాయించి శిలాఫలకాలు ఎలా వేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందు సాయిలు, సాంబశివ, కిరణ్, రాజయ్య, రామస్వామి, దేవేందర్, ప్రీతి పాల్గొన్నారు.

ఓరుగల్లుపై కాంగ్రెస్ గురి!

- క్యాడర్‌లో ఉత్తేజం నింపే ప్రయత్నం..
- ఉమ్మడి వరంగల్‌లో కార్యక్రమాలపై దృష్టి
- నిన్న రాహుల్‌గాంధీ రైతు సంఘర్షణ సభ.. నేడు హాథ్ సే హాథ్ జోడో యాత్ర
- ఆదివారం నుంచే ములుగులో ఏఐసీసీ, టీపీసీసీ నేతల మకాం..
- మేడారం నుంచి నేడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర షురూ..

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ కార్యకలాపాలపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి సారించింది. వచ్చే ఎన్నికల నాటికి క్యాడర్‌లో ఉత్తేజం నింపేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఏడాదిగా ఉమ్మడి వరంగల్‌పైన దృష్టి సారించిన కాంగ్రెస్ అధిష్టానం వరుస భారీ సభలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. మే 6 హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభకు ఏఐసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కాగా, దేశవ్యాప్తంగా రైతు డిక్లరేషన్ ప్రకటించారు. నేటి నుంచి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మేడారం సమక్క–సారలమ్మ సన్నిధి నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. ఉద్యమాల ఖిల్లాగా పేరున్న వరంగల్‌ను అన్ని పార్టీలు కేంద్రంగా చేసుకుంటున్నాయి. పార్టీ అధిష్టానం సైతం ఓరుగల్లుపై దృష్టి సారించింది.

'ఐ'క్యత కోసం నేతలతో భేటీ..

ఉమ్మడి వరంగల్‌లోని పలు నియోజకవర్గాల్లో సీనియర్ నాయకులకు పొసగడం లేదు. సభలు, సమావేశాలు జరుగుతున్న క్రమంలో విభేదాలు బయటపడినా.. ఇంత కాలం నెట్టుకొచ్చారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ములుగు ఎమ్మెల్యే సీతక్క, గండ్ర సత్యనారాయణ, వేం నరేందర్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాంనాయక్, దొంతి మాధవరెడ్డి, కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావు, నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, రాజేశ్వర్‌రావు, జంగా రాఘవరెడ్డి, కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్‌లతో పాటు పలువురి పేర్లు వచ్చే ఎన్నికల రేసులో ఉన్నట్లు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నలుగురైదుగురికి పైగా పోటీపడుతున్నారు. కొందరు నాయకులు రెండు, మూడేసి నియోజకవర్గాల్లో టికెట్ కోసం ఖర్చీఫ్ వేసుకునే పనిలో తిరుగుతుండటంతో విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. దీంతో నాయకుల మధ్య సమన్వయం కుదరక ఇష్టారాజ్యంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పాదయాత్రను విజయవంతం చేయాలని హైకమాండ్ నుంచి ఉన్న ఆదేశాలమేరకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం సీనియర్ నాయకులతో మాట్లాడినట్లు తెలిసింది. అందరూ కలిసి ఐక్యంగా పనిచేయాలని సమన్వయం చేసిన తర్వాతే మేడారం నుంచి రేవంత్ పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు చెబుతున్నారు.

పోరుగడ్డ నుంచే పాదయాత్ర..

హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ఉద్యమాల ఖిల్లా, పోరుగడ్డ వరంగల్‌ను రేవంత్‌రెడ్డి ఎంచుకున్నారు. ఈ మేరకు సోమవారం నుంచి ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టనుండగా.. మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క, టీపీసీసీ నేతలు మల్లు రవి, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, మాజీ ఎంపీ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, గండ్ర సత్యనారాయణరావు, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఆదివారమే చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రను మన ఇంటి కార్యక్రమంగా భావించి అన్ని వర్గాల వారు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర షెడ్యూల్‌ను పార్టీ నాయకులు విడుదల చేశారు. 6వ తేదీ ఉదయం 11 గంటలకు మేడారం నుంచి ప్రారంభం కానుంది.

పోరాటాల ఫలితంగా వేతనాల పెంపు

భూపాలపల్లి అర్బన్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశల వారీగా చేసిన పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం జీఓ 8 విడుదల చేసిందని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది మార్చి 15న అసెంబ్లీలో కార్మికుల గౌరవవేతనం రూ.1000 రూపాయల నుంచి 3వేలకు పెంచుతూ ప్రకటించినట్లు తెలిపారు. ఆనాటి నుంచి జీఓ విడుదల చేయకపోవడంతో అనేక పోరాటాలు చేసినట్లు చెప్పారు. దీంతో మూడు రోజుల క్రితం ప్రభుత్వం జీఓ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తంచేస్తున్నట్లు తెలిపారు.

నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కేసు నమోదు

కాజీపేట రూరల్: పోలీసులపై దురుసుగా ప్రవర్తించి వారి విధులను అటంకపరచిన నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ఆదివారం కాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. కాజీపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన బి.నాగు ఈ నెల 4న రాత్రి వడ్డెపల్లి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద హుండాయి కార్ నంబర్ ఏపీ 36 ఏఎల్ 7806 ఆపకుండా వెళ్లగా అతనిని వెంబడించి పట్టుకొని వాహనం డాక్యుమెంట్స్ అడుగగా ఇవ్వను అని పోలీసులతో తాగిన మైకంలో వాగ్వాదం చేసి విధులకు అటంకపరిచినట్లు తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రెడిట్‌కార్డు పేరుతో మోసం

కాజీపేట దర్గా అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తికి ఒక అతను ఫోన్ చేసి నేను కొటక్ మహీంద్ర క్రెడిట్ కార్డు ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకోవాలంటే నేను ఒక లింక్ పంపిస్తున్నాను. ఆ లింక్‌ను ఓపెన్ చేసి మీ క్రెడిట్ కార్డు వివరాలు ఎంటర్ చేయమని చెప్పగా ఆ వ్యక్తి లింక్ ఓపెన్ చేసి క్రెడిట్ కార్డు వివరాలు పంపించగా ఓటీపీలు ఓపెన్‌చేయగా అతని క్రెడిట్ కార్డు నుంచి రూ.1,11,395లు డెబిట్ అయిపోయినట్లు మెస్సేజ్ వచ్చింది. వెంటనే సదరు వ్యక్తి మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మహేందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

కేవైసీ వివరాలు అప్‌డేట్ చేస్తానని మోసం

కాజీపేట వెంకటాద్రినగర్‌కు చెందిన ఒకతనికి జనవరి 23న మీ ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ బ్లాక్ అయింది. అప్‌డేట్ చేసుకోవాలని ఒక మెసేజ్ రాగా వెంటనే ఆ వ్యక్తి ఆ లింక్‌ను ఓపెన్ చేసి అతని కేవైసీ వివరాలు అందులో ఎంటర్ చేశాడు. ఓటీపీలు కూడా ఎంటర్ చేయగా అతని ఎస్‌బీఐ అకౌంట్ నుంచి రూ.25 వేలు డెబిట్ అయ్యాయి. అతను వెంటనే గ్రహించి సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మహేందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


కుమారస్వామి (ఫైల్)

వరంగల్ రూరల్ : ఎనుమాముల శివారు బాలాజీనగర్‌కు చెందిన గంధం కుమారస్వామి ఆదివారం ఉదయం తన నివాసంలో అప్పు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య గంధం లక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ చేరాలు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కుమారస్వామి వ్యాపార నిమిత్తం అడిగొప్పుల సాంబేశ్వర్ (బాబురావు), అతని భార్య ప్రమీల, కోట విజయ్‌కుమార్‌ల వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలంటూ వారి వేధింపులను భరించలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపింది. కేసు పూర్వపరాలను పరిశీలించి విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు.

చాలా సంతోషంగా ఉంది



అమ్మవార్లను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది. పౌర్ణమి రోజు కావడంతో అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని విశ్వాసం ఉంది. గద్దెల పైకి అధికారులు అనుమతించడంతో ఆనందంగా ఉంది.

- సంధ్య, భక్తురాలు, హైదరాబాద్

వనదేవతలపై విశ్వాసం



వనదేవతల దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని నమ్మకం ఉంది. పెళ్లి అయ్యి ఇద్దరు పిల్లలు పుట్టిన ప్పటి నుంచి అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రతి యేటా కుటుంబంతో వస్తున్నాం. పౌర్ణమి రోజు మొక్కులు చెల్లించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం.

- దివ్య, భక్తురాలు, వరంగల్

అందరి సహకారంతో విజయవంతం..



జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో నాలుగు రోజుల పాటు జరిగిన మినీజాతర విజయవంతమైంది. మండ మెలిగె పండుగ సందర్భంగా పూజారులు పూజలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా సహకరించారు. జాతర విజయవంతానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు.

- రాజేంద్రం, ఈఓ

జాతరలో పకడ్బందీగా చర్యలు



సమ్మక్క, సారలమ్మ మినీ జాతరలో పోలీసుశాఖ తరఫున జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళిక బద్ధంగా అన్ని చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, సూచనల మేరకు అధికారులు. సిబ్బంది సమష్టిగా పని చేసి జాతరను సక్సెస్ చేశాం. ట్రాఫిక్‌జామ్ కాకుండా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం దగ్గర పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశాం.

- శంకర్, సీఐ పస్రా

ప్రణాళికబద్ధంగా వ్యవహరించాం..



భక్తులకు ఎలాంటి అటంకాలు కలుగకుండా పోలీస్ శాఖ తరఫున చర్యలు తీసుకున్నాం. ఎస్పీ గౌస్ ఆలం సూచనల మేరకు ప్రణాళికబద్ధంగా వ్యవహరించి భక్తులకు అటంకం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ, దర్శనాలు జరిగేలా చర్యలు తీసుకున్నాం.

- ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్సై, తాడ్వాయి

మేడారం జనారణ్యం

1.50 లక్షల మందికిపైగా తరలివచ్చిన భక్తులు


ఎదురుకోడి మొక్కు..



- అమ్మవార్లకు పౌర్ణమి పూజలు
- భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణాలు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతరకు ఆదివారం 1.50 లక్షల మందికి పైగా భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. శనివారంతో మినీజాతర ముగిసినప్పటికీ ఆదివారం మాఘశుద్ధ పౌర్ణమి కావడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ సుదూర ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల దర్శించుకునేందుకు భక్తులకు గంటల తరబడి సమయం పట్టింది. భక్తుల సందడితో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఈఓ రాజేంద్రం భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారికి ఏర్పాట్లను చేశారు.

శనివారం రాత్రి నుంచే రద్దీ..

శనివారం రాత్రి నుంచే భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా వాహనాలు మేడారంలో బారులు తీరాయి. పస్రా నుంచి వాహనాల రాకతో నార్లాపూర్‌లో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్‌తో అంతరాయం ఏర్పడింది. వెంటనే అక్కడి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


సమ్మక్క గద్దె వద్ద భక్తుల కోలాహలం

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు..

ఆదివారం లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అంచనాతో పోలీసు ఉన్నతాధికారులు మేడారంలో ఉన్న అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎస్పీ గౌస్ ఆలం మేడారంను సందర్శించి భక్తుల రద్దీని పర్యవేక్షించారు. భక్తుల వాహనాలను పోలీసులు పార్కింగ్ ప్రదేశాలకు మళ్లింపు చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరగడంతో ఆర్టీసీ బస్సుల సంఖ్యను కూడా అధికారులు పెంచారు.


సారలమ్మ గద్దె వద్ద భక్తుల కోలాహలం


క్యూలో భక్తుల రద్దీ


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు


షవర్ల కింద స్నానాలు చేస్తున్న భక్తులు


జంపన్నవాగులో శివసత్తుల పూనకాలు


మేడారం సమీపంలో వంటలు, భోజనాలు


వాహనాల్లో మేడారం చేరుకుంటున్న భక్తులు

రామప్పలో భక్తుల సందడి


రామప్ప శిల్పకళను పరిశీలిస్తున్న సందర్శకులు

వెంకటాపురం(ఎం): మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం విద్యార్థులు, భక్తులు, పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. సుమారుగా పదివేల మంది పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు భక్తులకు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

రామప్పను సందర్శించిన ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సారయ్య

రామప్ప దేవాలయాన్ని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య దంపతులు, జిల్లా పరిషత్ కౌన్సిల్ చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు వేర్వేరుగా సందర్శించారు.ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రాలను బహూకరించారు. కాకతీయ రాజులు ముందుచూపుతో నిర్మించిన దేవాలయాలు, సరస్సులు నేటి ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించారు. వారి వెంట డీపీఓ వెంకయ్య, పాలంపేట సర్పంచ్ డోలి రజితా శ్రీనివాస్. ఎంపీవో తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

- వాట్సాప్ స్టేటస్‌తో రూ.50వేల సేకరణ
- అభినందించిన కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు

దీన గాథ

చిట్యాల : లా అండ్ ఆర్డర్‌ను కాపాడడమే కాదు ఆపదలో ఉన్న వారిని తన వంతు సాయం చేసి కాపాడుదామనే సంకల్పం అతనిది. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి ప్రమాదవశాత్తు గొంతు, పక్కటెముకలు విరిగి మంచానికే పరిమితమైన అతని దీనగాథను చూసి చలించిపోయాడు. శాయంపేట మండలం వసంతాపూర్‌కు చెందిన మంద రాములు వారం క్రితం ప్రమాదానికి గురికావడంతో గొంతుకు 24 కుట్లు, పక్క బొక్కలు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. బాధితుడికి భార్య, ఒక కూతురు ఉంది. ప్రస్తుతం ఆమె గర్భిణీ. మరో వారం రోజుల్లో డెలివరీకి రావాలని డాక్టర్ చెప్పాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అతన్ని ఆదుకోవాలని నిర్ణయించుకొని మిత్రునికి సాయం చేయాలంటూ పదోతరగతి బ్యాచ్‌కు చెందిన చిట్యాలలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లాల్‌సింగ్ వాట్సాప్ స్టేటస్ ద్వారా రూ.50 వేలు సేకరించి బాధితుడికి అందించాడు. ఆ డబ్బులు రాముకు ఇచ్చి ధైర్యం చెప్పాడు. తను పెట్టిన స్టేటస్‌కి స్పందించి సాయం అందించిన చిట్యాల గ్రామ ప్రజలకు, తన తోటి సిబ్బందికి లాల్‌సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవాలని కోరాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కానిస్టేబల్‌ను అభినందించారు.


ఆర్థికసాయం అందజేస్తున్న లాల్‌సింగ్

15 క్వింటాళ్ల బెల్లం పట్టివేత

- వాహనం సీజ్ చేసిన ఎక్సైజ్ సీఐ

దంతాలపల్లి: 15 క్విటాళ్ల నల్లబెల్లం పట్టుకొని బొలెరో వాహనాన్ని సీజ్ చేసినట్లు తొర్రూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లం వస్తుందన్న పక్కా సమాచారంతో ఆదివారం తెల్లవారుజామున, తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దంతాలపల్లి, బొడ్లాడ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అటుగా వచ్చిన ఏపీ03 టీపీ 0096 నంబర్ గల బొలెరో వాహనం ఆపడంతో వాహనంపై అనుమానం వచ్చి దాడి జరిపారు. వాహనంలో (50 కిలోల బస్తాలు 30) 15 క్వింటాళ్ల నల్లబెల్లం, 5 కిలోల పటిక, 20 లీటర్ల నాటుసారా పట్టుబడిందన్నారు. వాహనంలోని వ్యక్తులను విచారించగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం దేవునిగుట్ట తండాకు చెందిన ఇస్లావత్ విజయ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన ఎం.జానకిరామ్‌గా గుర్తించారు. వీరంతా కలిసి తొర్రూరు, నర్సింహులపేట మండలాల్లోని గ్రామాల్లో అక్రమంగా నల్లబెల్లం, పటిక రవాణా చేసేందుకు తీసుకొచ్చినట్లు తెలిపారన్నారు. ఇస్లావత్ విజయ్, జానకిరామ్‌పై కేసు నమోదు చేసి నాటుసారా, పటిక, బెల్లం వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురికి తీవ్రగాయాలు

గార్ల: మండల కేంద్రం సమీపంలోని శ్మశాన వాటిక మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్-బైక్ ఢీకొనడంతో ముగ్గురు బైకిస్టులకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలావున్నాయి. పాకాల ఏటి మూలమలుపు వద్ద రాంపురం నుంచి మట్టి లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను గండితండాకు చెందిన బి.లాలూప్రసాద్, బానోత్ లక్ష్మణ్‌నాయక్, గుగులోత్ పృథ్వీనాయక్ బైక్‌పై వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో లాలూప్రసాద్‌కు కాలు విరగగా లక్ష్మణ్‌నాయక్ తలకు గాయాలు, పృథ్వీకి స్వల్ప గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యురాలు చైతన్య తెలిపారు.